



చంద్రగిరి, న్యూస్‌టుడే: పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం చంద్రగిరి రాయలవారి కోటలో రూ.6 కోట్లతో రూపొందించిన సౌండ్ అండ్ లైటింగ్ షో (అద్భుత రూపవాణి)ను ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అంతకుముందు చంద్రగిరి బస్టాండు నుంచి రాయలవారికోట వరకు విద్యార్థులు, అధికారులు, నాయకులు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ శుభం భన్సల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు నేరుగా లబ్ధి

- వ్యక్తిగత ఖాతాలో పింఛన్ నగదు జమకు ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి ప్రయోజనం



పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అర్హులకు సామాజిక భద్రత పింఛన్లు అందిస్తోంది. వైకల్యం 45 శాతం పైబడిన వారందరికీ రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు సాయం అందుతోంది. జిల్లాలో నివాస ప్రాంతాలకు దూరంగా ఎంతో మంది విద్యార్థులు వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్నారు. పుత్తూరు, చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల్లో బధిర పాఠశాలలున్నాయి. అక్కడ వేలాది మంది పలు మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్నారు. వీరంతా ప్రతినెలా స్వగ్రామాలకు వెళ్లి పింఛన్లు అందుకోవాల్సిందే. ఈ కష్టం నుంచి వారిని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.

ప్రభుత్వం నెల మొదటి రోజే పింఛను అందిస్తోంది. దీంతో దివ్యాంగ విద్యార్థులు ముందు రోజే వారి స్వస్థలాలకు రావాల్సి వస్తోంది. చాలా మంది ఒంటరిగా ప్రయాణం చేయలేకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, సోదరులు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి. దీంతో రవాణా ఛార్జీల భారం వారిపై పడుతోంది. దీనికి తోడు పాఠశాలలకు వెళ్లేందుకు మరో రోజు ఇలా.. హాజరు కోల్పోతున్నారు. ఇది వారి విద్యాభ్యాసంపై ప్రభావం చూపుతోంది.

పట్టించుకోని వైకాపా పాలకులు

కూలీ పని చేసుకుని జీవనం సాగించే ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు అవస్థలు పడుతున్నారు. గత వైకాపా హయాంలో ఈ సమస్యను పరిష్కరించాలని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు మొరపెట్టుకున్నా ప్రభుత్వం ఆలకించలేదు.

అండగా కూటమి ప్రభుత్వం

సీఎం చంద్రబాబు ఇటీవల నిర్వహించిన దివ్యాంగుల సంక్షేమశాఖ సమీక్షలో ఈ అంశం చర్చకు వచ్చింది. వెంటనే విద్యార్థుల అవస్థలను దృష్టిలో ఉంచుకుని నవంబరు నుంచి పింఛను మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

తల్లిదండ్రులకు భారం తగ్గుతుంది..



మాది సత్యవేడు నియోజకవర్గం కేవీబీ పురం మండలం ఆరె గ్రామం. తండ్రి కష్టపడుతూ పుత్తూరు మదర్‌థెరిసా బధిర పాఠశాలలో 10వ తరగతి చదివిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛను తీసుకోవడానికి ప్రతి నెలా ఇంటికి వెళ్లాల్సిందే. అక్కడికి వెళ్లేందుకు ఒకరి సాయం కావాలి. అది వారికి భారమయ్యేది. ప్రభుత్వ నిర్ణయంతో ఆ చింత తీరుతుంది. **- రాకేష్, దివ్యాంగుడు**

వ్యయప్రయాసలు తప్పుతాయి..



కేవీబీపురం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన రామచంద్రయ్య కుమారుడు జీవా దివ్యాంగుడు. దీంతో పుత్తూరులోని బధిర పాఠశాలలో చేర్పించారు. ప్రతి నెలా అతనికి ప్రభుత్వం సామాజిక భద్రత పెన్షన్ అందిస్తోంది. ఆ పెన్షన్ కోసం ఇన్నాళ్లు గ్రామానికి వెళ్లాల్సి వచ్చేది. ఇకపై ఆ బాధ తప్పుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెప్మా.. మీ పాత్రెంతో చెప్మా!

- తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక, కుప్పం ఎన్నికల్లో వైకాపా నేతలకు సాయం
- ఆలస్యంగా వెలుగు చూస్తున్న అక్రమాలు



తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెప్మా అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లో పేదల ఆర్థికాభివృద్ధికి చేదోడువాదోడుగా ఉండాల్సిన మెప్మా ఉద్యోగులు రాజకీయ నాయకుల కుట్రలో భాగస్వాములయ్యారు. తిరుపతి లోక్‌సభ స్థానం ఉప ఎన్నిక, కుప్పం పురపాలక ఎన్నికల్లో దొంగ ఓటర్ల జాబితా రూపకల్పన, ఫొటోల మార్ఫింగ్ వ్యవహారంలో మెప్మా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. తమ తప్పులు బయటపడతాయని సిఫార్సులు పొంది బదిలీల్ని నిలుపుకొంటున్న తరుణంలో ఈ విషయాలు బయటపడుతున్నాయి.

కుప్పంలో బెదిరించి, ప్రలోభపెట్టి

కుప్పం పురపాలిక ఎన్నికలను అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వైకాపా నేతలంతా కుప్పంలో తిష్ఠ వేసి అనుకూలమైన అధికారులను నియమించుకున్నారు. ఈ ఎన్నికల్లో తెర వెనుక కుట్రదారుల్లో మెప్మా ఉద్యోగులు ఉన్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఎన్నికలకు ముందు 12 రోజుల పాటు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 90 శాతం మంది ఉద్యోగులకు కుప్పం ఎన్నికల విధులు కేటాయించారు. స్థానిక వైకాపా నేతల పర్యవేక్షణలో కుప్పంలో ప్రతి వార్డులో తిరిగి మహిళా సంఘాల సభ్యుల్ని బెదిరించారు.. ప్రలోభాలకు గురిచేశారు. ఎన్నికల సమయంలో కుప్పం మహిళా సంఘాలు డీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తుండగా.. డీఆర్‌డీఏ అధికారులు సైతం కుప్పంలో తిష్ఠ వేశారు. ఎన్నికల తరువాతే కుప్పంలోని మహిళా సంఘాలు డ్వాక్రా నుంచి మెప్మాలోకి చేరాయి.

శిబిరాల నిర్వహణ.. బస్సుల్లో తరలింపు

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికకు ముందు తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, పలమనేరు, శ్రీకాళహస్తిలో మెప్మా సంఘాల సభ్యుల వివరాల్ని సేకరించారు. తిరుపతి సమీపంలోని తనపల్లె వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో మెప్మా అధికారులు ఇందుకోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో వారిని తిరుపతిలోని పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో తరలించారు.

సెలవు పెట్టి అనధికారిక విధులు

తిరుపతి ఉప ఎన్నిక, కుప్పం పురపాలిక ఎన్నికల సమయంలో సీఎంఎం, టీఎంఎం, సీవో, మెప్మా పథక సంచాలకుల కార్యాలయంలోని టీఈ తదితర హోదాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 90 శాతం మంది వైకాపా కార్యకర్తల అవతారం ఎత్తారు. 12 రోజుల పాటు సెలవుపై వెళ్తున్నట్లు లేఖలు రాసి మెప్మా పీడీ కార్యాలయానికి సమర్పించి అనధికారిక విధులకు హాజరయ్యారు. విధులు పూర్తయ్యాక నెల రోజులు ఎటువంటి వివాదం లేకపోవడంతో హాజరు పట్టికలో సంతకాలు చేసి పూర్తి జీతాలు తీసుకున్నట్లు సమాచారం. కుప్పం ఎన్నికల కోసం వెళ్లిన ఉద్యోగుల వివరాలు కనుక్కొంటాం. హాజరుపై విచారిస్తామని మెప్మా పీడీ రాధమ్మ తెలిపారు.

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా శుక్రవారం తిరుమల వచ్చిన భక్తులకు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 2 గంటలు పడుతోంది. గురువారం శ్రీవారిని 61,328 మంది దర్శించుకున్నారు. రూ.3.84 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

104FM Tirupati
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
కాలేజి స్టైల్	సా॥ 5 - రా॥ 9
ఈ స్టార్ మీ స్టార్	రా॥ 9 - రా॥ 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 10 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

ఆక్రమణల తొలగింపు



ఈనాడు కథనానికి స్పందన

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని వికృతమాలలో ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. వైకాపా ఐదేళ్ల పాలనలో స్థానిక నేతలు పెద్దఎత్తున ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇంటి స్థలాలుగా మార్చి అమ్మకాలు చేపట్టారు. అయితే నామమాత్రంగా కొందరి పేదలకు చెందిన చిన్నదుకాణాలు తొలగించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. దీనిపై ఈనాడులో ఈ నెల 22న 'ఆక్రమణలు కొండంత తొలగించింది గోరంత' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ భార్గవి ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించేందుకు దృష్టి సారించారు. గత రెండు రోజులుగా అక్రమ కట్టడాలను తొలగించే పనిలో నిమగ్నమైయ్యారు.

వికృతమాలలో ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

అప్పుడు నిర్బంధాలు.. ఇప్పుడు నోటీసులు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం రోడ్డెక్కుతారన్నా.. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షాలు నిరసన తెలుపుతాయన్నా.. ప్రభుత్వ ఉద్యోగులు స్వరం పెంచుతారన్నా.. గత వైకాపా హయాంలో పోలీసులు ఉన్నఫలంగా అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడేవారు. ఇప్పుడు.. శ్రీవారి ప్రసాదాల్లో కల్తీ ఆరోపణలతో అట్టుడిగిపోతున్న తరుణంలో తిరుమల దర్శనార్థం వస్తున్న మాజీ సీఎం జగన్‌కు అనుకూలంగా వైకాపా శ్రేణులు ప్రతి కూడలిలో స్వాగతం పలుకుతామని ప్రకటించినా.. కూటమి పార్టీలు, హిందూ సంఘాలు డిక్లరేషన్ కోసం డిమాండ్ చేయడంతో జిల్లాలో రేగిన ఉత్కంఠకు నోటీసులతో అడ్డుకట్ట వేయగలిగారు. అప్పటికే అమలులో ఉన్న సెక్షన్ 30 పోలీస్ యాక్టు మేరకు కొన్ని గంటల్లో దాదాపు 500 మందికి నోటీసులు ఇచ్చారు. కేవలం ఒక పార్టీ నాయకులకు మాత్రమే కాకుండా.. అన్ని పార్టీల్లోని నాయకులకు నోటీసులు ఇచ్చారు. జిల్లాలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని, సమావేశాలు, ర్యాలీలు చేయదలుచుకుంటే ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపైకి వచ్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దీంతో జిల్లాలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు తావులేకుండా పోయింది.

తెప్పలపై విఘ్ననాథుడి విహారం



కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం రాత్రి సిద్ధిబుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామివారు పవిత్ర పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులను అలరించారు. ముందుగా మిరుమిట్లు గొలిపే విద్యుత్తు దీపాలంకరణ, పుష్పాలతో రూపొందించిన తెప్పలపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. పుష్కరిణిలో బెల్లం, చిల్లర నాణేలు, కర్పూర హారతులను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి ఆలయంలో 7వ తేదీ నుంచి శుక్రవారం వరకు 21 రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు, ప్రత్యేకోత్సవాలు తెప్పోత్సవంతో ముగిశాయి. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈవో పి.గురుప్రసాద్, కాణిపాకం సర్పంచి కె.శాంతిసాగర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.




మహారథాన్ని లాగుతున్న భక్తులు, ఉద్యోగులు

శ్రీవారి బంగారు, మహారథం ట్రయల్ రన్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామివారి బంగారు రథం, మహారథానికి ట్రయల్ రన్ నిర్వహించారు. భక్తులు, ఉద్యోగులు కొంతదూరం లాగగా ఇంజినీరింగ్, తితిదే అధికారులు పరిశీలించారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రథాలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌కు పర్యాటక గుర్తింపు



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టూరిజం అవార్డు ఫర్ ఎక్సలెన్స్ 2023-24 జాబితాలో తిరుపతి రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని విజయవాడ వేదికగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తిరుపతి రైల్వేస్టేషన్‌ను 'ఉత్తమ పర్యాటక స్నేహపూర్వక రైల్వేస్టేషన్'గా ప్రకటించారు. అందుకు సంబంధించిన అవార్డు, ప్రశంసా పత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, గుంతకల్ ఏడీఆర్‌ఎం సుధాకర్ అందుకున్నారు.

ఎంటెక్ ఫలితాల విడుదల

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంటెక్(సీబీసీఎస్) మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. వివరాలను ఎస్వీయూ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

పోటు సిబ్బంది చెప్పినా పట్టించుకోలేదు..!



- నెయ్యి బాగోలేదన్నా చర్యలు తీసుకోలేదు
- తాము అనుకున్నదే చేసిన నాటి తితిదే పాలకమండలి, అధికారులు

ఈనాడు-తిరుపతి: తిరుమలలోని ఏ మాడ వీధిలో తిరిగినా గతంలో లడ్డూ ఘుమఘుమలు ముక్కుకు తగిలేవి.. ఆ సువాసన పీలిస్తే అదో అనుభూతి కలిగేది.. స్వామి ప్రసాదాన్ని స్వీకరించినంత ఆనందం పొందేవారు.. అదంతా గతం.. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో తిరుపతి లడ్డూను మిఠాయి కొట్లలోని ఒక సరకుగానే చూశారు. నాణ్యతను పక్కనబెట్టి నాసిరకం నెయ్యి, జీడిపప్పు, యాలకులు ఇతరత్రా సామగ్రిని వినియోగించారు. శ్రీవారి భక్తులకు ఎటువంటి లడ్డూ ఇచ్చినా స్వీకరిస్తారన్న అహంకారంతో వ్యవహరించారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నాసిరకం దినుసులు, కల్తీ వాడారు. దీంతో రుచి, సువాసన పూర్తిగా మారిపోయింది. ఈ విషయమై భక్తులతో పాటు పోటు సిబ్బంది పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

శ్రీవారి ఆలయంలో రోజుకు సుమారు 3.5 లక్షల లడ్డూలను తయారు చేస్తారు. ఇందుకు 14 టన్నుల నెయ్యిని వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో తిరుమలలో 82,100 కిలోల సామర్థ్యంతో మూడు నెయ్యి యూనిట్లు ఉన్నాయి. భక్తులకు అవసరమైన మేరకు లడ్డూలు సరఫరా చేయాల్సిన నేపథ్యంలో 40 థర్మో ఫ్లూయిడ్ స్టవ్‌లతో బూందీపోటును ఏర్పాటు చేశారు. గతంలో లడ్డూను తయారు చేసేందుకు స్వచ్ఛమైన ఆవు నెయ్యిని వినియోగించేవారు. వైకాపా హయాంలో నాసిరకం నెయ్యి వినియోగించడాన్ని తొలుత బూందీపోటులో పనిచేసే పోటు సిబ్బంది గుర్తించారు. అనేకసార్లు డిప్యూటీ, ఈవో సూపరింటెండెంట్ల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. సాధారణంగా బూందీ, నెయ్యి కలిసినప్పుడు సువాసన వస్తుంది. మాడ వీధుల్లో తిరుగుతున్న భక్తులు సైతం ఈ సువాసనను ఆస్వాదించేవారు. నాసిరకం నెయ్యి వినియోగించినప్పటి నుంచి లడ్డూ తయారు చేసేటప్పుడే కనీసం సువాసన వచ్చేది కాదని కొందరు పోటు సిబ్బంది పేర్కొంటున్నారు. నెయ్యిని చూస్తేనే దాని ప్రమాణాలు గుర్తించవచ్చని, ఇది అధికారులకు ఎందుకు అర్థం కాలేదో తెలియట్లేదన్నారు. గతంలో దూరంగా ఉన్నా సంచీలో లడ్డూ ఉంటే ఆ వాసనకే తిరుమలకు వెళ్లి వచ్చారా అని గుర్తించే పరిస్థితి ఉండేదని, వైకాపా హయాంలో చేతిలో పట్టుకున్నా వాసన తెలియని దుస్థితి నెలకొందని సిబ్బంది వాపోయారు. అధికారులు చెప్పినా పట్టించుకోకపోవడంతో తాము ఏమీ చేయలేని పరిస్థితని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల ఆలయ మాజీ ప్రధాన అర్చకులు రమణదీక్షితులు సైతం గతంలో లడ్డూ దూరంగా ఉన్నా సువాసన వచ్చేదని, గత ఐదేళ్లలో అది కనిపించలేదని స్పష్టం చేశారు. నిత్యం లడ్డూ తయారు చేసే పోటు సిబ్బంది, మాజీ ప్రధాన అర్చకుడు సైతం వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు కనీసం చర్యలు తీసుకోలేదు. దీన్ని ఆసరాగా తీసుకుని సరఫరాదారులు కల్తీ నెయ్యిని పంపి శ్రీవారికి ద్రోహం చేయడంతోపాటు భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు క్షత్రియ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి క్షత్రియ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్, బైరాగి కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (28 సెప్టెంబర్ 2024, శనివారం), రేపు (29 సెప్టెంబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్స్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

డొక్కు వాహనమే దిక్కు



వేలాడుతున్న 108 ముందు భాగాలు

రేణిగుంట, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల కూడలి రేణిగుంట.. అంతర్జాతీయ విమానాశ్రయం.. ప్రధాన రైల్వే జంక్షన్‌తో పాటు మూడు పారిశ్రామికవాడలు.. వేలాది మంది కార్మికులు.. ఇంతటి కీలకమైన రేణిగుంటలో డొక్కు 108 అంబులెన్స్‌తో సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



సౌకర్యాలు లేని లోపలి భాగం

రేణిగుంట ప్రాంతంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఆస్పత్రులకు సకాలంలో చేర్చకపోవడంతో క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారు. స్థానికంగా ఒత్తిడి రావడంతో అధికారులు ఈ ప్రాంతానికి 108 వాహనాన్ని కేటాయించారు. ఆపై ఆ వాహనాన్ని భాకరాపేటకు పంపి రేణిగుంటకు సరిగ్గా పనిచేయని వాహనాన్ని తీసుకొచ్చారని స్థానికులు వాపోతున్నారు.

ఊడిపోయే స్థితిలో ఉన్నా..

రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న 108లో అన్నీ సమస్యలే. సైరన్ పని చేయదు. మోనిటర్, ఏసీ, పవర్, బీపీ యంత్రం, పవర్ జంక్షన్, ఫ్యాన్లు, స్ట్రెచర్, అంబులెన్స్ అని సూచించే దీపాలు సక్రమంగా లేని దుస్థితి. వాహనం ముందు భాగాలు వేలాడుతున్నాయి. టైర్లు అరిగిపోయాయి.

కార్మికులు, యాత్రికుల కూడలి

రేణిగుంట సమీపంలోని జాతీయ రహదారుల మీదుగా నిత్యం సుమారు 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మూడు పారిశ్రామికవాడలతో పాటు ఎంఎస్ఈ 1, 2 పరిశ్రమ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడి పరిశ్రమల్లో సుమారు 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. విమానాశ్రయం, రైల్వే జంక్షన్‌లు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఈ డొక్కు వాహనం బాధితులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చేందుకు ఇబ్బందులు తప్పడంలేదు.



రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచిన అంబులెన్స్

ఎక్కడికీ పంపలేదు

నేనొచ్చిన రెండేళ్లలో ఇక్కడున్న వాహనాన్ని ఎక్కడికీ పంపలేదు. ఈ వాహనం బాగుంది. అన్ని సక్రమంగా పని చేస్తున్నాయి. సమస్యలుంటే మరమ్మతు చేయిస్తాం. **- శ్రీనివాస్, 108 ఇన్‌ఛార్జి**

కాలుష్య కోరల్లో తెలుగుగంగ

పరిశ్రమల ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలతో ప్రమాదం

వరదయ్యపాళెం, సత్యవేడు : తమిళనాడుకు తాగునీరు అందిస్తూ, మరోవైపు నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి వరప్రదాయిని అయిన తెలుగుగంగ కాలువ నీరు విషతుల్యమవుతోంది. పరిశ్రమల రసాయన వ్యర్థాలు, కాలం చెల్లిన మందులు, ప్లాస్టిక్ వ్యర్థాలతో తెలుగుగంగ విషపూరితంగా మారుతోంది. వ్యర్థాలు కలవడంతో గంగ నీటితో పండించే ఆహారధాన్యాలు విషపూరితమవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రాణాంతకం.. ప్రమాదకరం

నియోజకవర్గంలో బీఎన్‌కండ్రిగ, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల పాలిట తెలుగుగంగ కాలువ సాగునీటి వరప్రదాయినిగా ఉంది. సత్యవేడు మండలం చిన్నఈటిపాకం - అమాసరెడ్డి కండ్రిగ మధ్య గల తెలుగుగంగ ప్రధాన కాలువపై రాత్రివేళల్లో రహస్యంగా వివిధ పరిశ్రమల వ్యర్థాలను పడవేస్తున్నారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే ప్లాస్టిక్, రసాయన వస్తువులు, ఇతర వ్యర్థాలను తెలుగుగంగ కాలువ ఆనకట్టపై వేస్తుండటంతో ఈ వ్యర్థాలు కొండగుట్టలా దర్శనమిస్తున్నాయి. గ్రామాలకు, జనావాసాలకు దూరంగా నిర్జీవమైన అటవీప్రాంతంలో ఈ కాలువ ప్రవహిస్తుండటంతో రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో రసాయనాలు నీటిలో చేరి కలుషితం కావడంవల్ల ఈ నీటిని తాగునీటిగా వినియోగించే తమిళనాడు ప్రజల ఆరోగ్యంపై సైతం ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన నెలకొంది. చెరువులకు, కాలువలకు చేరడంతో ఈ నీటిని సాగునీటిగా వినియోగించడంతో ఆహారధాన్యాలు విషపూరితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



కాలువ వద్ద మందులు, రసాయన వ్యర్థాలు

గుత్తేదారుల నిర్లక్ష్యం

శ్రీసిటీలోని పలు పరిశ్రమల నుంచి వ్యర్థాలను తరలించేందుకు ఒప్పందం చేసుకున్న గుత్తేదారులు తమ స్వార్థానికి ఇలా పడేస్తున్నారు. పరిశ్రమల్లో వ్యర్థాలను తరలించేందుకు కాంట్రాక్టు పొందిన గుత్తేదారులు వీటిని అడవులు, కాలువలు, చెరువుల్లో పడేసి నెలకు రూ.లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇటీవల బీఎన్‌కండ్రిగ మండలం నెలవాయి చెరువులో రసాయన వ్యర్థాలను రహస్యంగా పడవేయడంతో చెరువులో నీరు కలుషితమైంది. ఇందులో దిగిన పశువులు మృతి చెందడంతో అక్కడ రైతులు వ్యర్థాలను తరలించే గుత్తేదారులను అడ్డుకున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువ ఒడ్డున గుట్టలా పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



రసాయన వ్యర్థాలతో నెలవాయి చెరువు

ఉత్తమ సేవలకు జాతీయస్థాయి గుర్తింపు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ జాతీయ జియోస్పేషియల్ ఫ్యాకల్టీ ఫెలో అవార్డును అందుకున్నారు. విద్యాజీస్, స్పేషియల్‌లెన్స్, వికాస్ వంటి వాటితో విద్య, పారిశ్రామిక రంగాల్లో వివిధ సంస్థలకు విలువైన సాంకేతిక సాయాన్ని అందించినందుకు జాతీయ విద్యా మంత్రిత్వశాఖ, జాతీయ విద్యామిషన్ ఆధ్వర్యంలో ఫోస్సీ, ఐఐటీ బాంబే నుంచి శుక్రవారం అవార్డును అందుకున్నారు. సాంకేతిక అభివృద్ధి, స్టార్టప్స్ ప్రోత్సాహం, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు శ్రీవాత్సవ సేవలు అభినందనీయమన్నారు. ఇదేరీతిలో మరిన్ని సాంకేతిక సేవా కార్యక్రమాలు అందించాలని సూచించారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ, అనురాగ్‌కుమార్, బెంగళూరుకు చెందిన ఐఐఎస్సీ మాజీ డైరెక్టర్ అనంత్ కృష్ణ, పెన్నాన్ చిన్నస్వామి, రాజేంద్రన్ పాల్గొన్నారు.



అనంతకృష్ణన్ నుంచి అవార్డును అందుకుంటున్న రోషన్ శ్రీవాత్సవ, పక్కన సత్యనారాయణ



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ కృష్ణమోహన్

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారిని శుక్రవారం రాత్రి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

హైందవ ధర్మాన్ని రక్షించాలని శ్రీవారిని ప్రార్థించా

తిరుమల, తిరుచానూరు, న్యూస్‌టుడే: హైందవ ధర్మాన్ని, దేవాలయాలను రక్షించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు భాజపా నాయకురాలు మాధవీలత తెలిపారు. శుక్రవారం ఉదయం బ్రేక్ సమయంలో శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. జగన్ ఒక మతాన్ని అనుసరిస్తూ.. మరో మతంలోకి వచ్చి తప్పులు చేస్తారా అంటూ ప్రశ్నించారు. హైందవులందరూ జాగృతమై హిందూ ధర్మాన్ని, ఆలయాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని కూడా మాధవీలత దర్శించుకున్నారు.



ఆలయం ఎదుట మాట్లాడుతున్న మాధవీలత

తిరుమలలో నాగుపాము కలకలం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల-పాపవినాశనం రోడ్డులోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో భారీ నాగుపాము కలకలం సృష్టించింది. ఆలయానికి వెళ్లే మార్గంలోని ఓ దుకాణం వెనుక పాము ఉన్నట్లు గుర్తించిన దుకాణదారులు తితిదే అటవీ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఆయన పది అడుగుల నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం పామును అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.



నాగుపాముతో భాస్కర్‌నాయుడు

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	195




సమావేశంలో స్వామీజీలు, నేతలు

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

తిరుపతి(బైరాగిపట్టెడ) : హిందూ ధార్మిక సంఘాల పరిరక్షణకు, దేవాలయాల సంరక్షణ కోసం తిరుపతిలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఓ ప్రైవేట్ హోటల్లో సాధువులు, హిందూ సంఘాల నేతలు, జనసేన నేత కిరణ్ రాయల్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బోర్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి ఉంటామని తెలిపారు. మాజీ సీఎం జగన్ గత ఐదేళ్లలో తిరుమల పవిత్రతను కాపాడలేదని, తిరుమల ప్రాశస్త్యంపై జగన్‌కు గౌరవం లేదన్నారు. జనసేన నేత కిరణ్ రాయల్ మాట్లాడుతూ.. తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రజలను రెచ్చగొటే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. జ్యోతిస్వరూపానంద స్వామి, త్యాగరాజ నంద స్వామి, దయానంద దత్త స్వామి, రామానజనేయ స్వామి, నరసింహ స్వామి, విద్యాసాగర్, ఆకేపాటి సుభాషిణి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

తితిదే నిబంధనలు అందరూ పాటించాల్సిందే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ప్రతి ఒక్కరూ ఆలయ నియమ నిబంధనలు పాటించి శ్రీవారిని దర్శించుకోవాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. 'మాజీ సీఎం జగన్‌కు.. శ్రీవారి ఆలయ సంప్రదాయాలు, నిబంధనలపై అవగాహన కలిగేలా 'ఆనందనిలయం, హరికొలువు' పుస్తకాలను పంపుతున్నా. వాటిని ఆయన చదువుకుని అందుకు అనుగుణంగా ఇక్కడ సంప్రదాయాలు పాటించాలి. అన్యమతస్థులు ఎవరైనా డిక్లరేషన్ ఇచ్చి శ్రీవారిని దర్శించుకోవచ్చు. నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తితిదే అధికారులను కోరుతున్నా'నని అన్నారు.



ఆలయం ఎదుట పుస్తకాలతో భానుప్రకాష్‌రెడ్డి

తీవ్రంగా గాయపడిన యువకుడి మృతి

తడ, న్యూస్‌టుడే: రామాపురం ఎస్సీ కాలనీలో భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డ కావేరి అరుణ్‌కుమార్(22) చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. అరుణ్‌కుమార్ రాత్రిళ్లు ఇంటి మేడపై పడుకునేవారు. ఈ నెల 19న ఎప్పటిలాగే మేడపై నిద్రించగా.. రక్షణ గోడ లేకపోవడంతో నిద్రమత్తులో కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తడ ఎస్సై కొండప్ప నాయుడు తెలిపారు.

మహిళా వర్సిటీని సందర్శించిన ఉన్నత విద్యామండలి కమిటీ

మహిళా వర్సిటీ(తిరుపతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిపుణుల కమిటీ శుక్రవారం శ్రీ పద్మావతి మహిళా వర్సిటీని సందర్శించింది. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ రజినితో కమిటీ సభ్యులు ఆచార్య ఫజుల్ రెహమాన్(డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ వర్సిటీ మాజీ వీసీ), ఆచార్య కె.సంగీత (కోయంబత్తూర్ భారతీయార్ వర్సిటీ ఐక్యూఏసీ సంచాలకులు), ఎన్ఐఆర్ఎఫ్ కో-ఆర్డినేటర్ ఆచార్య భాస్కర్‌భట్టాచార్య సమావేశమయ్యారు. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌పై చర్చించారు. వర్సిటీల్లో విద్య, పరిశోధన, బోధనలో పాటించాల్సిన నాణ్యత, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో వంద ర్యాంకులలోపు ఉండేందుకు చేయాల్సిన అభివృద్ధిని కార్యకలాపాలపై మాట్లాడారు. ఎన్ఐఆర్ఎఫ్ మహిళా వర్సిటీ సంచాలకులు వెంటకృష్ణ, ఐక్యూఏసీ సంచాలకులు త్రిపురసుందరి, కో-డైరెక్టర్ ఉష, సభ్యులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం, పారిశుద్ధ్యానికి పెద్దపీట

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అన్నప్రసాదం, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలని తితిదే ఈవో జె.శ్యామలరావు పేర్కొన్నారు. ఏర్పాట్లపై తితిదేలోని అన్ని విభాగాలతో ఆయన స్థానిక అన్నమయ్య భవనంలో శుక్రవారం తుది సమావేశం నిర్వహించారు. తితిదేలోని అన్ని శాఖలు రాజీలేకుండా తమకు కేటాయించిన పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ఇంజినీరింగ్ పనులు, శ్రీవారి ఆలయం, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, ఉద్యానవనశాఖ, అటవీశాఖ, సాంస్కృతిక, భజన బృందాలు, రవాణా, గోశాల, వైద్యవిభాగాలను ఈవో పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డీఎల్‌వో వరప్రసాద్, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజేఐ పర్యటన విజయవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్) : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం రెండు రోజుల పర్యటనకు రానున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డా. ధనంజయ వై.చంద్రచూడ్ పర్యటన విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జేసీ శుభం భన్సల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు సీజేఐ రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, తిరుమలకు బయలుదేరి వెళ్తారన్నారు. ఆదివారం శ్రీవారి దర్శనానంతరం మధ్యాహ్నం 2.35 గంటలకు విమానాశ్రయం చేరుకుని తిరుగు ప్రయాణం కానున్నట్లు చెప్పారు. 29న జిల్లా పర్యటనకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు రానున్నట్లు చెప్పారు. 1 నుంచి జిల్లాలో 8 రోజుల పాటు జాతీయ స్థాయి మానిటరింగ్ బృందం పర్యటిస్తుందన్నారు.

2న క్రికెట్ జట్ల ఎంపికలు

తిరుపతి(క్రీడలు) : ఉమ్మడి చిత్తూరు జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-19 క్రికెట్ బాలబాలికల జట్ల ఎంపికలు జరగనున్నట్లు జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. అక్టోబరు 2వ తేదీన చిత్తూరులోని డీఎస్ఏ మెసానికల్ మైదానంలో ఉదయం 9.30 గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు.

భాషా సామర్థ్యాలు వెలికితీయాలి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: చిన్నారుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడానికి భాషా సామర్థ్యాలు వెలికితీయాలని డీఈవో వి.శేఖర్ అన్నారు. శుక్రవారం మంగళం (ట్రెండ్స్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బాల కథానిధి పుస్తకావిష్కరణ, అష్టావధానంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. జిల్లా పరిధిలో పిల్లలు రాసిన బాలసాహిత్య కథల పుస్తకం 'బాలకథానిధి' పుస్తకావిష్కరణ చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ సాహితీ వేత్త సాకం నాగరాజ మాట్లాడుతూ నేటి పిల్లలకు పఠనంపై ఆసక్తి పెంచేలా పుస్తకాలు చదివించాలన్నారు. అనంతరం జరిగిన అష్టావధానానికి సమన్వయకర్తగా శతావధాని ఆముదాల మురళి వ్యవహరించగా హర్ష అవధానం చేశారు. డీవైఈవో బాలాజీ, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న డీఈవో శేఖర్, రచయిత సాకం నాగరాజ, సాహితీవేత్తలు

ఇసుక ట్రాక్టర్ రాణాకు తరలింపులో హైడ్రామా

వదిలిపెట్టాలని అధికార పార్టీ నేత పంచాయితీ

సూళ్లూరుపేట : ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరును రెవెన్యూ, పోలీసులు సిబ్బంది పట్టుకుని రాణాకు తరలించే విషయంలో హైడ్రామా నెలకొంది. ట్రాక్టర్‌ను వదిలిపెట్టాలని అధికారపార్టీ నేత పంచాయితీ పెట్టారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని ఇలుపూరు సమీపంలోని కాళంగి నది నుంచి ఇసుకను బండ్ల ద్వారా సమీప ప్రాంతాలకు తరలించి, అక్కడ నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రెవెన్యూ, పోలీసులతో నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇలుపూరు నుంచి ఇసుక తీసుకుని వస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్వో ఇల్లి శ్రీదేవి, పోలీసులు పట్టుకున్నారు. రాణాకు తీసుకొస్తుండగా మార్గమధ్యలో మండల తెదేపా అధ్యక్షుడు కొక్కు శంకరయ్య అడ్డుకున్నారు. ట్రాక్టర్‌ను వదిలిపెట్టాలని వీఆర్వోపై ఒత్తిడి చేశారు. 'తహసీల్దార్ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తోలుకోమని చెప్పారని, మీరు ఎలా ఆపుతారు' అని వీఆర్వోపై మండిపడ్డారు. తహసీల్దార్ ఆదేశాలతోనే ట్రాక్టర్లను పట్టుకున్నామని ఆమె సమాధానమిచ్చారు. విషయం అందరికీ తెలియడంతో ట్రాక్టర్‌ను రాణాకు తరలించారు.



జాతీయ రహదారిపై వీఆర్వో, పోలీసులతో మాట్లాడుతున్న శంకరయ్య

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

ముగిసిన శిక్షణ

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన విభాగం, సెరికల్చర్, న్యాయ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రూస ప్రాజెక్టులో భాగంగా వేమూరులోని మహిళలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

66 మందికి ఉద్యోగాలు

తిరుపతి(నగరపాలిక, బైరాగిపట్టెడ) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 66 మందికి ఉద్యోగాలు లభించినట్లు అధికారులు తెలిపారు. 104 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డా.ద్వారకనాథరెడ్డి తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు 66 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

పారిశుద్ధ్యంపై నాటక ప్రదర్శనలు

తిరుపతి(నగరపాలిక): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించే కార్యక్రమాల్ని కొనసాగిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం ప్రకాశం పార్కు, వైకుంఠపురం ఆర్చి వద్ద పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించేలా నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

'ధర్మారెడ్డి ఆచూకీ తెలిపితే బహుమతి'

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: తితిదే మాజీ ఈవో ధర్మారెడ్డి ఆచూకీ తెలిపిన వారికి రూ.1116 బహుమతి ఇస్తానని భాజపా నేత నవీన్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఈవోలు జవహర్‌రెడ్డి, ధర్మారెడ్డిల మౌనం తితిదేలో జరిగిన అవినీతికి పరాకాష్ఠ అని తెలిపారు. లడ్డూ కల్తీపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుండగా వారు కనిపించకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.



తిరుచ్చిపై శ్రీపద్మావతీదేవి

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారు శుక్రవారం రాత్రి తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

4 నుంచి కపిలేశ్వరాలయంలో ఉత్సవాలు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీకపిలేశ్వరాలయంలో శ్రీ కామాక్షి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. అమ్మవారు ఒక్కో రోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందుకోసం ఆలయంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 29న ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు.

గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

పాకాల, న్యూస్‌టుడే: మండల గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమాన్ని పెద్దగోర్పాడులో శుక్రవారం నిర్వహించారు. ఇంటి నిర్మాణం చేపట్టనివారు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రభాకర్ సూచించారు. ఈవోఆర్డీ మాలతి, హౌసింగ్ ఏఈ మహేష్‌నాయుడు, తెదేపా నాయకులు చెంగల్రాయనాయుడు, నాని, వెంకటేష్, అరుణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని శుక్రవారం ఉదయం నగరపాలక కమిషనర్ మౌర్య, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు.



ఆలయం ఎదుట కమిషనర్ మౌర్య దంపతులు

ఊరెళ్తున్నారా.. ఎల్‌హెచ్‌ఎంఎస్ అమర్చుకున్నారా!

* ఇటీవల తిరుపతి రూరల్ ఓటేరు పంచాయతీలోని మూడిళ్లలో దొంగలు పడి దోచుకున్నారు. అందులో రెండిళ్లు తాళాలు వేసి బయటకు వెళ్లారు. మరో ఇంటి వారు దిగువ పోర్షన్‌కు తాళాలు వేసి.. పైఅంతస్తులో నిద్రిస్తున్నారు. దొంగలు స్వేచ్ఛగా చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి బయట ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసు నిఘా కెమెరా పెట్టుకుని ఉంటే చోరీని అడ్డుకునే వెసులుబాటు ఉండేది.

* తిరుపతి రూరల్ పీఎస్ పరిధిలోని ఉప్పరపల్లి గరుడా గేట్‌వేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వ్యక్తి ఊరెళ్తూ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ అమర్చుకున్నారు. అర్ధరాత్రి దాటాక ఇద్దరు దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించడంతో ఎల్‌హెచ్‌ఎంఎస్ సైరన్ పంపింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఒకరిని అదుపులోకి తీసుకోగా.. మరొకరు పారిపోయారు.

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: 'మేము ఊరెళుతున్నాం.. మా ఇంటిని కాస్త చూసుకోండ'ని పక్కింటి వారికి చెప్పి గతంలో ఊరెళ్లేవారు. అలా చెప్పి ఊరెళ్లే బంధాలు.. నమ్మకాలు ఇప్పుడు సన్నగిల్లడంతో 50 ఇళ్లు ఉన్న బహుళ అంతస్తుల భవనంలోనూ దొంగతనాలు జరిగిపోతున్నాయి. కష్టపడి సంపాదించిన నగదు, నగలను బీరువా లాకర్‌లో భద్రపరిచి 'హమ్మయ్య' అనుకుంటున్నారే గానీ.. అక్కడి వరకు దొంగలు రానీయకుండా అడ్డుకునేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. దొంగతనం జరిగాక లబోదిబోమని పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. చోరీలను నియంత్రించడం కూడా పోలీసు శాఖకు సవాలుగా మారడంతో లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను అమలు పరుస్తోంది. 'మీరు ఊరెళుతున్నారా.. అయితే దరఖాస్తు చేసుకోండి.. మీ ఇంటికి మేము కాపలా'గా ఉంటామని పోలీసులు ప్రకటిస్తున్నారు.



అమర్చే పోలీసు నిఘా కెమెరా

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

ప్రస్తుతం అందరి చేతుల్లో ఉన్న ఆండ్రాయిడ్ చరవాణుల ద్వారా ఉచితంగా ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఓపెన్ చేసుకుని రిజిస్ట్రేషన్ నిమిత్తం పేరు, చరవాణి నంబరు, ఇంటి డోర్ నంబరు, చిరునామా వివరాలు నమోదు చేయాలి. చరవాణికి వచ్చే ఐదంకెల ఓటీపీ నంబరును నమోదు చేస్తే యూనిక్ ఐడీ డిస్‌ప్లే అవుతుంది. దాని ద్వారా ఎప్పుడు ఊరెళ్లాలన్నా ముందు రోజు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత ఐడీ ద్వారా తరచూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఒకవేళ ఐడీ మరిచిపోతే కమాండ్ కంట్రోల్ పోలీసులను సంప్రదిస్తే.. నమోదు సమయంలోని చరవాణి నెంబరు చెప్పితే ఐడీ నంబరు ఇస్తారు. ఏ తేదీన.. ఎంత సమయానికి ఊరెళుతున్నారు. ఎప్పుడు, ఏ సమయానికి తిరిగి వస్తారనే వివరాలు సంబంధిత యూనిక్ ఐడీ ద్వారా అప్‌లోడ్ చేసే మెసేజ్ వస్తుంది. ఆ ప్రకారం అందిన దరఖాస్తుతో పోలీసులు ఇంటికి వచ్చి సీసీ కెమెరా అమర్చుతారు. లొకేషన్ తీసుకుని చిరునామా గుర్తిస్తారు.

ఆస్తులు కాపాడుకోండని పోలీసు శాఖ విజ్ఞప్తి

పోలీసు కెమెరాలతో నిరంతర నిఘా

పోలీసు కెమెరా అమర్చుకుంటే నిరంతరం నిఘా ఉంటుంది. ప్రజలకు అవసరమైన సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే పోలీసు వాట్సప్ నంబరు 80999 99977, కంట్రోల్ రూమ్ నంబరు 63099 13960, డయల్ 100కు సమాచారం ఇవ్వాలి. - ఎల్.సుబ్బరాయుడు, ఎస్పీ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: రైల్వేకాలనీ పార్కుకు ఉత్తరం దిక్కున ఉన్న రోడ్డుపై యూడీఎస్ మ్యాన్‌హోల్ నుంచి మురుగు పొంగుతోంది. - భాస్కర్‌నాయుడు, రైల్వే కాలనీ

సమాధానం: యూడీఎస్ సమస్యను పరిష్కరిస్తాం. - డా.అన్వేష్‌రెడ్డి, వైద్యాధికారి, నగరపాలిక

మ్యాన్‌హోల్ మరమ్మతు

స్పందనకు వందనం

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: స్థానిక తిలక్ రోడ్డులోని కరిమారియమ్మ దేవాలయం సమీపంలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేశారు. ఈ నెల 15న 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారులు ఈ మేరకు స్పందించారు.



ఎస్పీ కార్యాలయం వద్ద బాధితుడు, సీపీఎం నాయకులు

పోలీసులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: వెంకటగిరి జాతరలో దళిత యువకుడు చెంచుకుమార్‌ని కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు గోపి, రవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బాధితుడితో కలసి అదనపు ఎస్పీ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోకపోతే ఈ నెల 28వ తేదీ వెంకటగిరి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ● వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని ఆర్పీడీ చట్టం 2016 కమిటీ సభ్యులు కొణతం చంద్రశేఖర్, ఏపీ నిరుద్యోగ వికలాంగుల ఐకాస నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావును కలసి వినతిపత్రం అందజేశారు.



ఐకాస నాయకులు అందజేసిన డీడీని చూస్తున్న సీఎం చంద్రబాబు

వరద బాధితులకు కేబుల్ ఆపరేటర్ల విరాళం

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర కేబుల్ ఆపరేటర్ల ఐకాస తరపున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి తిరుపతికి చెందిన ఐకాస ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ మధు ఈ మొత్తాన్ని డీడీ రూపంలో అందజేశారు. నాయకులు సీతరామయ్య, బసవయ్య, నగేష్, శాంతికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా సంఘీభావ దీక్ష

తిరుచానూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా తిరుచానూరుకు చెందిన అమ్మవారి భక్తుడు మునిరామ్‌రెడ్డి సంఘీభావ దీక్ష చేపట్టారు. శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద ఆయన కొబ్బరి కాయలు కొట్టి ఆయన 11 రోజుల దీక్షను ప్రారంభించారు. ఆయనకు తిరుచానూరుకు చెందిన భాజపా, జనసేన, తెదేపా నాయకులు సంఘీభావం ప్రకటించారు. నాయకులు బాలకృష్ణ, వెంకట్‌రాయల్, ప్రతాప్, మునిరత్నం రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట శ్రీవారి చిత్రపటంతో మునిరామ్‌రెడ్డి తదితరులు



భానుప్రకాష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న భాజపా నాయకులు

ఘనంగా పుట్టినరోజు వేడుకలు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: నగరంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భాజపా నాయకులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంవీ సాయి ప్రసాద్, కోలా ఆనంద్, హేమ కిరణ్, నవీన్‌కుమార్, కిట్టు, సామంచి శ్రీనివాస్, బాల భాస్కర్, డాక్టర్ జయ ప్రసాద్, సూర్యప్రకాష్ రెడ్డి, రాజా, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న విద్యాశాఖాధికారి నాగరాజునాయుడు

జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మహిళా వర్సిటీ(తిరుపతి): జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్వీ యూనివర్సిటీ సీడీసీ డీన్ చంద్రాయుడు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం నూతన విద్యార్థి సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తితిదే విద్యాశాఖాధికారి నాగరాజునాయుడు మాట్లాడుతూ అధ్యాపకులతో విద్యార్థినులు మంచి సంబంధాలను కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపల్ నారాయణమ్మ, స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌ఛార్జి జ్యోతి, భద్రమణి, భువనేశ్వరిదేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కొండారెడ్డి

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్‌గా జి.వి.కొండారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖర్లు స్వాగతం పలికి సత్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ బాషా, నాయకులు రమేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, బాల తదితరులు కలిసి సత్కరించారు.

సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనలను విజయవంతం చేద్దాం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటనలను కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నేతలు పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల అనంతరం మొదటిసారి అక్టోబర్ రెండో తేదీన తిరుపతి రానున్నారు. అలిపిరి నుంచి నడక మార్గంలో తిరుమల చేరుకోనున్నారు. నాలుగో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఓ ప్రైవేటు హోటల్లో ఎమ్మెల్యే ఆరణి నేతృత్వంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తెదేపా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, భాజపా తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌రాయల్ బాయ్‌కాట్.. సమావేశంలో వేదికపైకి తనను ఆహ్వానించలేదని అలిగిన జనసేన నేత కిరణ్ రాయల్ సమావేశం నుంచి బాయ్‌కాట్ చేసి వెళ్లారు. ఆయనతోపాటు రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, పలు డివిజన్ల కార్యకర్తలు ఆయన వెంట వెళ్లారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి, వేదికపై మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, భాజపా, జనసేన నేతలు

డాక్టరేట్ ప్రదానం



శివప్రసాద్

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ సైన్స్ కళాశాల జియాలజీ విభాగం పరిశోధక విద్యార్థి కె.శివప్రసాద్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లానాయక్ తెలిపారు. విభాగ ఆచార్యులు టి.మధు మార్గదర్శకత్వంలో 'చిత్తూరు జిల్లాలోని పెద్దవాగు నదీ పరీవాహక ప్రాంతంలో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పద్ధతులను ఉపయోగించి హైడ్రోజియోలాజికల్ అంశాల సమగ్ర అధ్యయనం' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ఆయనకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

అసంపూర్తి నిర్మాణం.. పొంచి ఉన్న ప్రమాదం



తిరుపతి రామానుజ కూడలి నుంచి రేణిగుంటకు వెళ్లే మార్గంలో శ్రీనివాససేతు కింద రహదారి పక్కన మురుగు కాలువలో వాల్ నిర్మాణ పనుల కోసం గుంత తవ్వారు. నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో మురుగు, వర్షం నీటి ప్రవాహం కారణంగా రోడ్డు కింద భాగం కోతకు గురై ప్రమాదకరంగా తయారవుతోంది. భారీ వాహనాలు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ఈనాడు, తిరుపతి



ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థులు

కబడ్డీ, ఖోఖో జట్ల ఎంపిక

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: తిరుపతి నియోజకవర్గ స్థాయిలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీల్లో నియోజవకర్గ స్థాయి జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. ముత్యాలరెడ్డిపల్లి ఇయంఆర్ ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వంశీరాజు, పీఈటీ వెంకటముని పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: ఉస్తికాయల పెంట జడ్పీ పాఠశాల విద్యార్థిని పుష్పరేఖ రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ శుక్రవారం తెలిపారు. చిత్తూరులో జరిగిన అండర్-14 పరుగు పందెం పోటీల్లో పాల్గొని జిల్లాస్థాయిలో రెండో స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చెంగల్‌రాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

జాతీయ స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ

మంగళం(తిరుపతి), న్యూస్‌టుడే: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ చదరంగం పోటీల్లో మంగళంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహానికి చెందిన బాలురు రన్నరప్‌గా నిలిచారు. మంగళంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో శుక్రవారం బాలుర అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శనరెడ్డి, జిల్లా ప్రొబేషనర్ అధికారి లక్ష్మీపతి, గృహం ఉప పర్యవేక్షణ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

మహిళా వర్సిటీ(తిరుపతి): శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో, గ్రామీణాభివృద్ధి సంక్షేమ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీ విద్యార్థినులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సంక్షేమ సంస్థ ప్రధాన కార్యదర్శి గంగాధరం జీవామృతం తయారీ, ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల ఉత్పత్తిపై అవగాహన కల్పించారు. ఎస్వీయూ మాజీ ఉపాధ్యక్షులు రామమూర్తి, గ్రీన్‌టీమ్ సభ్యులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని మాలి దేశం ప్రతినిధులు అభిప్రాయ పడ్డారు. మండలంలోని బిల్లావాండ్లపల్లికి చెందిన రైతు సుబ్రహ్మణ్యం పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలను శుక్రవారం పరిశీలించారు. ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమి అడ్మినిస్ట్రేషన్ అధికారి శివారెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం, సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ రవిచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీడీవో బాలాజీనాయక్ అన్నారు. పంచాయతీల్లో శుక్రవారం సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. సర్పంచి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-2047పై ప్రత్యేక సమావేశాలను నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు మాధవయ్య, నాదమునియాదవ్, నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చంద్రగిరి గ్రామీణ: మండలంలో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. సర్పంచి యర్రయ్య, గ్రామ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: రైల్వే కాలనీలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ సెల్వరాజు, డిప్యూటీ జోనల్ మేనేజర్ బాలచంద్ర మోహన్, చీఫ్ మేనేజర్ ఆర్ ఎం.శేష గిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ మేనేజ్మెంట్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాలో పది మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ప్లేస్‌మెంట్ అధికారులు ఆచార్య అంజన్ బాబు, ఆచార్య రమేష్‌బాబు తెలిపారు. 56 మంది ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారన్నారు.

బంగారం చోరీ కేసుల్లో ఇద్దరికి రెండేళ్ల జైలు

తిరుపతి(లీగల్): ముత్యాలరెడ్డిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో 2021లో జరిగిన మూడు వేర్వేరు చోరీ కేసుల్లో తిరుపతి గ్రామీణ మండలం పెరుమాళ్లపల్లికి చెందిన పి.ఆదిశేఖర్, లక్ష్మిచెరువుకి చెందిన కె.మణికంఠ ఒక్కొక్కరికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు ఏపీపీ భానుకిరణ్మయి తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 10 మందికి జరిమానా

తిరుపతి(లీగల్): నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 10 మంది నిందితులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పర్యవేక్షకులు సుబ్బారెడ్డి, కోర్టు పోలీసు గిరి తెలిపారు. అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు ఆటో డ్రైవర్లు పి.కుమార్, ఆర్.బాలాజీ నాయక్‌లకు జరిమానాతోపాటు మూడు రోజులు జైలుశిక్ష విధించారు.

విలేకరి ఇంటిపై దాడి

భాకరాపేట, న్యూస్‌టుడే: యర్రావారిపాలెంకు చెందిన ఓ విలేకరి ఇంటిపై గురువారం రాత్రి కొంతమంది దాడి చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

కాణిపాకానికి మాలధారణ భక్తులు



తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి దర్శనం అనంతరం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి ఇరుముడితో వెళ్తూ నంది కూడలిలో 30 మంది అఖిల భారత గణేశ్ మాలధారణ భక్తులు కన్పించారు. వీరంతా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చినట్లు తెలిపారు. సిద్ధిపేట గురుస్వామి గోపి ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా వినాయక మాలధారణ ధరించి 21 రోజులు, 41 రోజులు దీక్షతో ప్రతి సంవత్సరం కాణిపాకం వినాయకస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు రోజుకు వెళ్తున్నట్లు తెలిపారు.

- ఈనాడు, తిరుపతి

సుధాకర్‌ప్రసాద్‌కు నివాళి.. రామచంద్రాపురం: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రెటరీ సుధాకర్ ప్రసాద్ వర్ధంతి శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి తహసీల్దార్ వెంకటరమణ, ఉప తహసీల్దార్ అన్వర్ బాషాతోపాటు కార్యాలయ సిబ్బంది నివాళి అర్పించారు. ఆర్ఐ కృష్ణమ్మ, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

30న పీఏసీఎస్ మహాజన సభ

నారాయణవనం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన మహాజన సభను నిర్వహించనున్నట్లు అధికారిక పర్సన్ ఇన్‌ఛార్జి నిరంజన్‌బాబు, సీఈవో బాలసుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. సంఘంలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు జరిగిన లావాదేవీలు, జమా నివేదికను పరిశీలించి సభ్యుల నుంచి ఆమోదం కోరుతామన్నారు. గత రెండేళ్లుగా సంఘంలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించని సభ్యులను, భూమి లేని సభ్యులను గుర్తించి, వారి సభ్యత్వం రద్దు చేస్తామన్నారు. ఈ అంశాలపై సంఘంలోని రైతులతో చర్చిస్తామని పేర్కొన్నారు.

'నోటీసులు ఇవ్వడం తగదు'

శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన నేపథ్యంలో పట్టణ పోలీసులు నోటీసులు ఇవ్వడం సరికాదంటూ ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. నోటీసులు ఇవ్వడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్య: ముడుగునీటి ప్రవాహం క్రమంగా జరగడం లేదు. కాల్వల్లో పాలిథిన్ వ్యర్థాలు పడేయడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

– నరసింహులు, ప్రాజెక్టువీధి, శ్రీకాళహస్తి

సమాధానం: సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– బాలకృష్ణ, పారిశుద్ధ్య విభాగం, పురపాలక సంఘం

గ్రామాలాభివృద్ధే లక్ష్యం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఎంపీడీవో త్రివిక్రమరావు అన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

శుక్రవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్‌కండ్రిగ సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 44 సీసీ రహదారులు ఏర్పాటు చేయడానికి రూ.2కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మౌలిక వసతులు, రహదారులు, ఇతర అభివృద్ధి పనులపై గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటమ్మ, ఉపసర్పంచి మునిరాజా, పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ కార్యదర్శిగా ఈశ్వరమ్మ

సీపీఎం పట్టణ కార్యదర్శిగా మాజీ వార్డు సభ్యురాలు ఈశ్వరమ్మను ఎన్నుకున్నారు. శనివారం నిర్వహించిన మహాసభలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామ సభలో పలు సమస్యలు

సత్యవేడు, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయక ఇళ్ల ముందే పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందన్నారు. ప్రధానంగా గవర్జ వీధిలో చెత్త సేకరణ చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మాంసం, చేపల మార్కెట్ పట్టణానికి వెలుపల నిర్వహిస్తే మంచిదని లేకుంటే వ్యర్థాలను ఆరుబయట పడేస్తున్నారన్నారు. దీంతో ప్రజల ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లోని నీటి ట్యాంకులను శుభ్రం చేయక ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని భాజపా నాయకులు మోహన్‌బాబు, సి.వెంకటేశ్వర్లు పంచాయతీ సెక్రెటరీ మునిరవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు హేమచంద్ర, రాధా, షణ్ముగం, సురేంద్ర, వైకాపా నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఉరుసు గంధం ఊరేగింపు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని బీపీఅగ్రహారంలో కొలువుదీరిన శ్రీహజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జుంలేషా పీర్ ఖాదర్‌వలీ అల్లా వారి ఉరుసు మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అల్లా వారి గంధానికి పుష్పాలంకరణలు చేసి మేళ వాద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



పురవీధుల్లో సాగుతున్న గంధం మెరవాణి

వాణి జరిపారు. దర్గా సయ్యద్ సర్వుద్దీన్ సాహెబ్ ఇంటి నుంచి బయలుదేరిన గంధోత్సవంలో పలువురు ముస్లింలు భాగస్వాములయ్యారు.

సంపద సృష్టి.. కలగా మిగిలి

పట్టించుకోని అధికారులు ● నీరుగారుతున్న పథకం

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రతి పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలు నేడు అధ్వానంగా మారాయి. గ్రామ స్థాయిలో చెత్తను సేకరించి దాని ద్వారా సంపదను సృష్టించాలన్న ప్రభుత్వ లక్ష్యం నేడు క్షేత్ర స్థాయిలో నీరుగారుతోంది. ప్రధానంగా గడిచిన ఐదేళ్లు పాటు రేణిగుంట మండలంలోని ఆయా పంచాయతీల పెద్దలు ఈ పథకాన్ని పూర్తిగా విస్మరించారు.

గ్రామ పంచాయతీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఈ పథకం ద్వారా ఆయా పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నది లక్ష్యం. ఈ పథకాన్ని గత ప్రభుత్వంలో పూర్తిగా గాలికి వదిలేశారు. చెత్త నిల్వల కోసం ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను నిర్మించారు. వీటి నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో శిథిలావస్థకు చేరాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా తొట్టెను నిర్మించారు. రేణిగుంట మండలంలోని 19 పంచాయతీల్లో ఒక్క కరకంబాడి మినహా మరే పంచాయతీలోనూ ఇదీ కనిపించడం లేదు. ఇక్కడ ఎవరు వచ్చినా ఒక కరకంబాడి కేంద్రాన్ని చూపించి చేతులు దులుపుకుంటున్నారు జిల్లా స్థాయి అధికారులు.



దుస్థితిలో వెంకటాపురం పంచాయతీ సంపద సృష్టి కేంద్రం

కనిపించని సేకరణ

ప్రతి రోజు గ్రామాల నుంచి చెత్త సేకరణకు బండ్లు, ప్లాస్టిక్ డబ్బాల ద్వారా సేకరణకు క్లాప్ మిత్రలను అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో నియమించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సకాలంలో వేతనాలు ఇవ్వక పోవడంతో చెత్త సేకరణ పూర్తిగా నిలిచింది. దీంతో ఈ కేంద్రాలు ఆసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. మరో పక్క పిచ్చి, ముళ్ల కంపలు ఏపుగా పెరిగిపోయాయి. తొట్టు, షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

కూటమి ప్రభుత్వంతో పరుగులు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కేంద్రాలపై దృష్టి సారించారు. ఈ కేంద్రాల నిర్వహణ పనులు చేపడుతున్నారు. గ్రామ పంచాయతీలను తిరిగి బలోపేతం చేస్తుండడంతో ఈ కేంద్రాల పనులను ప్రారంభించారు.

దృష్టి సారించాం

ఈ కేంద్రాల అభివృద్ధికి ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు దృష్టి సారించాం. ప్రతి పంచాయతీలోని కేంద్రంలో చెత్త సంపద సృష్టిస్తాం. ఆ విధంగా అందరికీ ఆదేశాలు జారీ చేస్తున్నాం.

– విష్ణుచిరంజీవి, ఎంపీడీవో, రేణిగుంట

ఆదిమూలంపై సస్పెన్షన్ తొలగించండి

నాగలాపురం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తెదేపా అధినాయకత్వం సస్పెన్షన్‌ను తొలగించాలని తెదేపా నేతలు శుక్రవారం డిమాండ్ చేశారు. స్థానిక మండల కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రాన్ని అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు ప్రేమ నిర్మలకుమార్, సర్పంచి దనపాలేశ్వనారు, మాజీ ఎంపీపీ మురళి, నేతలు శేషాద్రి, ఎస్ఎం సురేష్, అత్తిలి రవి శెట్టి, ఎండీ ఖామర్, సుధాకర్‌యాదవ్, నాగయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై కేసు కొట్టివేతపై దళిత నాయకుల హర్షం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల కేసును న్యాయ స్థానంలో కొట్టివేయడంపై మండల దళిత నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండు ఆవరణలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. నిత్యం ప్రజా సమస్యలపై శ్రమించే నాయకుడు ఆదిమూలం అన్నారు. పెంచలయ్య, ధర్మయ్య, మనోహర్, గోపి, రామనాథం పాల్గొన్నారు.

నూతన ఫ్యూజ్ కాలియర్ ఏర్పాటు

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పంచాయతీలోని పోస్టాఫీసువీధిలో పద్మా పిక్చర్ ప్యాలెస్ ఎదురుగా ఉన్న ఫ్యూజ్ కాలియర్‌ను మార్చారు. మూత లేకుండా మరీ కిందికి ఉండడంతో శుక్రవారం ఈనాడులో 'ప్రమాదకరంగా మారిన ఫ్యూజ్‌కాలియర్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టణాధ్యక్షులు మునుబాలశౌరి‌కు మార్పించాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

పాత రహదారిలో ఆర్డినరీ బస్సులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి-శ్రీకాళహస్తి ప్రధాన రహదారిపై గ్రామీణులకు ఉపయోగకరంగా ఆర్డినరీ ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏర్పేడుతో పాటు పాతరహదారికి ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఈనాడులో 'మేమున్నాం- మీకుతోడుగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరించారు.

ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు

ఏర్పేడు, న్యూస్‌టుడే: అధిక శబ్దంతో మైకులు పెట్టడంతో పాటు వాహనాలతో శబ్దకాలుష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏర్పేడు సీఐ జయచంద్ర హెచ్చరికలు జారీ చేశారు. శబ్దకాలుష్యంతో అవస్థలు పడుతున్న వైనంపై ఈనాడులో 'మేమున్నాం- మీకుతోడుగా' శీర్షికతో ఇటీవల కథనం ప్రచురితమైంది. స్పందించిన సీఐ నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించారు.

స్థిరాస్తి వ్యాపారుల ఆగడాలతో ఇబ్బందులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: స్థిరాస్తి వ్యాపారుల ఆగడాలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని మండలంలోని బసవయ్యపాలెం గ్రామస్థులు వాపోతున్నారు. కొందరు స్థిరాస్తి వ్యాపారులు చెరువును తవ్వి పైప్‌లైన్ వేసి రోడ్డు నిర్మిస్తున్న అక్రమిత భూమి వద్దకు శుక్రవారం గ్రామస్థులు చేరుకుని నిరసన చేపట్టారు. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని చెరువు కావడంతో భూముల విలువ అధికంగా ఉన్నాయని, ఈ క్రమంలోనే వ్యాపారుల దౌర్జన్యం అధికమైందన్నారు. రోడ్డు నిర్మాణాన్ని వ్యాపారులు అడ్డుకున్నామని, రాత్రికి రాత్రే పనులు పూర్తి చేశారని వాపోయారు. అధికారుల ప్రోత్సాహం స్థిరాస్తి వ్యాపారులకు అన్ని విధాలుగా కలిసొస్తోందన్నారు. వ్యాపారుల స్వార్థ ప్రయోజనాలకు రానున్న వర్షాలకు చెరువు కట్ట తెగి పంట పొలాలతో పాటు గ్రామానికి వరద ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



రోడ్డు నిర్మిస్తున్న ప్రాంతంలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ధర్మేంద్రకుమార్‌సింగ్ తెలిపారు. శుక్రవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పిచ్చి మొక్కలు తొలగించి మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గోపాల్, వసతి గృహ పర్యవేక్షకులు సచిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు సంరక్షిస్తున్న ప్రిన్సిపల్ ధర్మేంద్ర కుమార్‌సింగ్

ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీఏగా రమేష్

నాగలాపురం, న్యూస్‌టుడే: ఏపీఎస్‌పీడీసీఎల్ నాగలాపురం ఏడీఏగా రమేష్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మదనపల్లె నుంచి ఆయన నాగలాపురానికి బదిలీపై రాగా.. ఇక్కడ ఏడీఏగా పని చేస్తున్న చంద్రానాయక్ మదకశిరకు బదిలీపై వెళ్లారు.



పల్లికొండేశ్వరాలయ ఈవోగా లత

నాగలాపురం, న్యూస్‌టుడే: పల్లికొండేశ్వరాలయ ఈవోగా లత శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రామగిరి వాలీశ్వరాలయ ఈవోగా పని చేస్తున్న ఆమె బదిలీపై సురుటుపల్లికి వచ్చారు. గతంలోనూ ఆమె పల్లికొండేశ్వరాలయ ఈవోగా పని చేశారు.



పిచ్చాటూరు ఏపీఎంగా చంద్రకళ

నాగలాపురం, న్యూస్‌టుడే: పిచ్చాటూరు వెలుగు ఏపీఎంగా చంద్రకళ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నిండ్ర మండలం నుంచి ఆమె పిచ్చాటూరుకు బదిలీపై రాగా.. ఇక్కడ ఏపీఎంగా పని చేస్తున్న వనిత పుత్తూరు రూరల్‌కు బదిలీపై వెళ్లారు. నిండ్ర నుంచి సుబ్రహ్మణ్యం, నాగేంద్రకుమార్‌లు పిచ్చాటూరులో బాధ్యతలు చేపట్టారు.



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వరదయ్యపాళెం: ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి పౌష్టికాహారంతోనే బాలింతలు సైతం ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని సీడీపీవో దేవకుమారి అన్నారు. మండలంలోని నెలబూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా వివిధ రకాల వంటల్లో, ఆకుకూరల ప్రదర్శన చేపట్టారు.

కూలీ ధరలు తక్షణం పెంచాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సివిల్ సప్లయిస్ గిడ్డంగుల్లో పనిచేసే కార్మికులకు పెంచిన కూలీ రేట్లను తక్షణం పెంపుదల చేయాలంటూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులోని సివిల్ సప్లయిస్ గిడ్డంగి వద్ద శుక్రవారం కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా 5వ తేదీలోపు కార్మికులకు రావాల్సిన వేతనాలు వచ్చేవని, అయితే ప్రస్తుతం నెలాఖరు వరకు రావడంలేదని శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, హమాలీల యూనియన్ జిల్లా అధ్యక్షులు అయ్యప్ప, నాయుడు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

మొక్కల పెంపకం అలవాటుగా మార్చుకోవాలి

ఏర్పేడు, న్యూస్‌టుడే: చిన్నప్పటి నుంచే మొక్కలు పెంపకం అలవాటుగా మార్చుకోవాలని 'సేవ్ ఆక్సిజన్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కేశవులు తెలిపారు. మండలంలోని పెనుమల్లం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. పుట్టిన రోజులు, శుభకార్యాలు, వివాహాల్లో మొక్కలను బహుమతులుగా అందజేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా మొక్కలు నాటడం, పరిరక్షించుకోవడం అవశ్యకతను వివరించారు. బాలాజీ, జగన్నాథం, ప్రమకుమార్, ఢిల్లీ, హరిబాబు పాల్గొన్నారు.

యువశ్రీ మురళికి సత్కారం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: అష్టావధానంలో పృచ్ఛకుడిగా పాల్గొన్న రచయిత, కళ్లివెట్టు ఉన్నత పాఠశాల తెలుగు పండితులు యువశ్రీ మురళిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. తిరుపతిలోని మంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో తిరుపతి జిల్లాలోని విద్యార్థులచే రాయించిన బాల సాహిత్య కథలు, బాలకథానిధి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అష్టావధానంలో పాల్గొన్న యువశ్రీ మురళిని సత్కరించారు.

సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు

తొట్టంబేడు: రైతుల సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు నిలుస్తున్నాయని అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి రవిబాబు పేర్కొన్నారు. తంగేళ్లపాళెం సహకార సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం బ్యాంకు మహాజన సభ సమావేశం నిర్వహించారు. సీఈవో చిరంజీవిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సజీవంగా అభివృద్ధి పనులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పురపాలక సంఘ ఛైర్మన్ పేట రాధారెడ్డి భౌతికంగా ప్రజల్లో లేకపోయినా ఆయన చేపట్టిన అభివృద్ధి సజీవంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని తెదేపా నేతలు కొనియాడారు. రాధారెడ్డి 7వ వర్ధంతిని శుక్రవారం తెదేపా కార్యాలయంలో నిర్వహించారు. రాధారెడ్డి కుమారుడు బాలాజీరెడ్డి నేతృత్వంలో పేదలకు అన్నదానం చేశారు.

పాఠశాల ప్రగతిలో కమిటీ సభ్యులు భాగస్వామ్యం కావాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ప్రగతిలో సలహాకమిటీ ఛైర్మన్లు, సభ్యులు భాగస్వాములై విద్యార్థుల ఉజ్వల భవితకు పునాది వేయాలని ఎంఈవో సరస్వతి కోరారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాల కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్, సభ్యుల హక్కులు, బాధ్యతల గురించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైకాపా హయాంలోని భూకబ్జాలపై విచారణ చేపట్టాలి

రేణిగుంట, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రేణిగుంట మండలంలో జరిగిన భూకబ్జాలపై సమగ్ర విచారణ జరిపి అందుకు పాల్పడిన అప్పటి వైకాపా నాయకులు, దళారులపై చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్ కోరారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రేణిగుంట మండల స్థాయి సమస్యలపై సమావేశం నిర్వహించి, పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రేణిగుంట పేదలకు ఇళ్లు మండల పరిధిలోనే ఇంటి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలన్నారు. రేణిగుంట పంచాయతీలోని అండర్ డ్రైనేజీ వ్యవస్థను అమలుచేయాలని, పుత్తూరు మార్గంలోని



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బస్సులను రేణిగుంట మీదగా నడపాలని, సీఆర్ఎస్‌ను రైల్వే ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేసి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని తీర్మానించారు. వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, పట్టణ కార్యదర్శి ఈశ్వరమ్మ, సత్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా సర్పంచులు జనసేనలో చేరిక

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: బీఎన్‌కండ్రిగ మండలంలోని కొత్తపాళెం, పార్లపల్లి గ్రామాల సర్పంచులు సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య



పసుపులేటి హరిప్రసాద్ సమక్షంలో జనసేనలో చేరిన వైకాపా నాయకులు

శుక్రవారం తమ అనుచరులతో జనసేన పార్టీలో చేరారు. తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి లావణ్యకుమార్, మండల అధ్యక్షులు బాషా సమక్షంలో జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ సర్పంచులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో జనసేన పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. వారి వెంట వైకాపా నాయకులు కేశారి హరిప్రసాద్, చలపతి పలువురు పార్టీలో చేరారు.

పెచ్చులూడుతున్నా పట్టించుకోరు

మండలంలోని పీవీపురం పాఠశాలలోని తరగతి భవనాలు పెచ్చులూడి అధ్వానంగా మారాయి. పాఠశాల విద్యార్థులకు గదులు సరిపడక గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడులో అదనపు భవనాలకు శంకుస్థాపన చేసి వదిలేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచిన పట్టించుకునే నాథుడు లేరు. తాగునీరు వృథాఅవుతోంది. ఈ విషయమై ఎంఈవో వివరణ కోరగా పెచ్చులూడిన ప్రాంతం గుర్తించి, తాగునీటి ట్యాంకును మరమ్మతులు చేయిస్తాం. – న్యూస్‌టుడే, సత్యవేడు



పాపాలు చేసి డ్రామాలా..?

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పవిత్రమైన తిరుమలేశుని చెంత పాపాలు చేసి ఇప్పుడు డ్రామాలకు సిద్ధమవుతున్న వైకాపా నేతలు ప్రజలు క్షమించబోరని భాజపా రాష్ట్ర



మాట్లాడుతున్న భాజపా నేత కోలా ఆనంద్

కార్యదర్శి కోలా ఆనంద్ స్పష్టం చేశారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తిరుమల వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలేశుని దర్శనార్థం వస్తే విధిగా డిక్లరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిక్లరేషన్ లేకుండా తిరుమలకు అనుమతిస్తే తాము సహించబోమన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కల్తీ నెయ్యి లేదని, అసలు నెయ్యి ఉందని చెప్పడంతో ఆతని అహంకారధోరణికి నిదర్శనమని తెలిపారు. తితిదే మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి తిరుమలలో డ్రామాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సమావేశంలో భాజపా నేతలు సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, ఎస్వీ రమణ, అమర్‌నాథ్, నేతలు పాల్గొన్నారు.

వడిగా కనకాచలం అభివృద్ధి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రానున్న శరన్నవరాత్రి వార్షిక ఉత్సవాల సందర్భంగా ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఎండ తీవ్రత సమయంలో భక్తులు మెట్లు ఎక్కి అమ్మవారిని దర్శించుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. అయితే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రెండు వైపులా పూర్తి స్థాయిలో శాశ్వతంగా రేకులతో నీడ ఉండేలా పనులు జరుగుతున్నాయి. అలాగే కనకాచలంపై భక్తులు ప్రశాంతంగా కూర్చొని నిమ్మకాయ దీపాలు వెలిగించుకోవడం, అమ్మవారిని దర్శించుకోవడం తదితర వాటికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచన తో ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఆమేమేరా యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఈ దఫా నవరాత్రి సందర్భంగా దర్శనార్థం వచ్చే భక్తులకు ఎండ తీవ్రతతో పాటు వర్షం వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



కనకాచలంపై వేస్తున్న శాశ్వత షెడ్డు ఏర్పాటు పనులు

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురు స్వల్పంగా గాయ పడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని తెల్లి కోనేరు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కథనం మేరకు.. స్థానిక కాగితాలపురం హరిజనవాడకు చెందిన చల్లా విజయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో తిరుపతికి బయలుదేరారు. కూలి పనులకు ఎక్కించుకుని ఆర్టీసీ బస్టాండ్ వైపు వెళ్తుండగా తెల్లి కోనేరు సమీపంలో నెల్లూరు నుంచి తిరుపతి వెళ్తున్న వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పట్టణంలోని జైహింద్ పురానికి చెందిన చిన్నమ్మ, సున్నపు అరుంధతీపాలెం చెందిన ఇంద్ర తీవ్రంగా గాయపడగా ఆటో డ్రైవర్ వెంకటాచలం, విజయ, సుగుణలు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఆటోలో చిక్కుకున్న క్షతగాత్రులను స్థానికులు బయటకు తీసి చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇంద్ర, చిన్నమ్మలను మెరుగైన వైద్యం నిమిత్తం తిరుపతికి తరలించారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ అధికారులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని గాయపడినవారి వివరాలను సేకరించారు. ఘటనకు కారణమైన ఆర్టీసీ డ్రైవర్ మాధవపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట రైల్వేస్టేషన్‌లో అదృశ్యమైన తన భర్త ఆచూకీ తెలపాలని ఆయన భార్య స్థానిక జీఆర్‌పీ పోలీసులను శుక్రవారం ఆశ్రయించింది. పోలీసుల కథనం మేరకు.. కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం కాచాపురం గ్రామానికి చెందిన కురువ లింగన్న గత నెల 19వ తేదీ తిరుమల దర్శనార్థం వచ్చి తిరుగు ప్రయాణంలో భర్త కనిపించలేదన్నారు. ఎక్కడ వెతికినా కన్పించలేదన్నారు. ఎస్సై రవి మాట్లాడుతూ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గూడూరు

●గూడూరు ● వెంకటగిరి ● సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 70 నుంచి రూ. 90 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 70 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	134
లేయర్	115
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	195

ప్రమాణ స్వీకారం

నాయుడుపేట: నూతనంగా ఎంపికైన జిల్లా గ్రామీణ విభాగం ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు గూడూరు కిషోర్‌కుమార్, ఇతర కార్యవర్గం నాయుడుపేట ఆర్యవైశ్య ప్రాంగణంలో శనివారం ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు ఆ సంఘం కమిటీ శుక్రవారం తెలిపింది.

కుక్కలకు టీకాలు

స్పందనకు వందనం

వాకాడు: వాకాడులో కుక్కల బెడద తీవ్రంగా ఉండడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ నెల 14న 'పిక్కలు పీకేలా.. కుక్కలు' శీర్షికన కథనం 'ఈనాడు'లో ప్రచురితమైంది. సర్పంచి బండి వెంకటరత్నమ్మ, ఉప సర్పంచి పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఈవో ప్రవళిక స్పందించారు. కుక్కలకు వ్యాక్సిన్ వేసి నివారణ చర్యలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే:

సమస్య: కోట పంచాయతీ సమీపంలోని ర.భ రోడ్డు గుంతలమయమైంది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు.
– నాగూరు, స్థానికుడు

సమాధానం: త్వరలో రోడ్డు విస్తరణ పనులు పునః ప్రారంభిస్తాం.
– సుబ్బయ్యయాదవ్, డీఈ

న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

సమస్య: సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ముందు భాగంలోని కాలువలో పూడిక చేరింది. దుర్వాసనతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు.
– రమ్య, జీఎన్‌టీ రోడ్డు

సమాధానం: వెంటనే పూడికతీత చర్యలు చేపడుతాం. ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ వేదికపై నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, న్యూస్‌టుడే: దీపావళి నాటికి మహిళలకు ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే అవకాశం ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. మండలంలోని భీమవరంలో శుక్రవారం జరిగిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తోందన్నారు. భీమవరంలో ఎస్సీ, ఎస్టీ భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, సర్పంచి అమృత సరళ పాల్గొన్నారు.

లోపాలు ఉంటే క్షమించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: లక్షలాది మంది భక్తులు హాజరయ్యే పోలేరమ్మ జాతరలో ఏమైనా లోపాలు జరిగి ఉంటే క్షమించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. తెదేపా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశం మాట్లాడారు. జాతరలో చిన్నపాటి లోపాలు ఉంటాయని వీటిని చాలా వరకు సరిదిద్దామన్నారు. లోపాలు గుర్తించామని వచ్చే ఏడాది జరిగే జాతరలో లోపాలు లేకుండా చేస్తామన్నారు. దెబ్బతిన్న రథం స్థానంలో నూతన రథం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈవో శ్రీనివాసులురెడ్డి, నేతలు రాజేశ్వరరావు, ఆనంద్, చంద్రమౌళిరెడ్డి, కమిటీ సభ్యులు మురళీకృష్ణ, విశ్వనాథం, చంద్రారెడ్డి, కోనా వెంకటేశ్వరరావు, కృష్ణ, శివ, అనిల్ పాల్గొన్నారు.


తొలగని అడ్డంకులు.. తప్పని తిప్పలు

● ఏళ్లుగా ఆ గ్రామాలకు శాపం
● హామీలు అమలు చేయని పాలకులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: 'నన్ను గెలిపించండి ఇక మీకు తారు రోడ్డు తెప్పించడం ఖాయం' అంటూ ఎన్నికల సమయంలో నేతలు చేతులు జోడించి ఓట్లు అడుగుతున్నారు.. గెలిచాక ప్రతిపాదనలు పంపాం.. చేస్తాం, చూస్తాం అంటున్నారే తప్ప రోడ్డు నిర్మాణానికి చొరవ తీసుకోవడం లేదు' అని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 కి.మీ. గమ్యానికి సరైన దారి లేక 26 కి.మీ ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏడు దశాబ్దాలు దాటినా అటవీ అభ్యంతరాలను తొలగించే దిక్కు లేక నేటికీ రోడ్డు కలగానే మిగిలిపోతున్న పల్లెల పరిస్థితి ఇదీ..



నిడిగల్లు రైల్వేస్టేషన్ నుంచి కరిమెనగుంటకు 2.5 కి.మీ. దూరం ఉంది. 2018లో తారు రోడ్డు నిర్మాణానికి రూ.85 లక్షలతో శిలాఫలకం వేశారు. ఇదంతా అటవీ పొలాల్లో ఉందని గుర్తించి ఆ శాఖ పనులను అడ్డుకుంది. 500 మంది జనాభా ఉన్న ఆ గ్రామానికి నిత్యం నడకే శరణ్యం. పైగా గిరిజనులు ఎక్కువగా నివసించే పల్లె ఇది.



గాజులపల్లి నుంచి కామకూరుకు 5.7 కి.మీ. దూరం ఉంటుంది. ఈ మార్గంలో 1998లో మట్టి రోడ్డు ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సు ప్రవేశపెట్టారు. తర్వాత రూ.1.60 కోట్లు నిధులు వచ్చినా ఆ రోడ్డు అటవీ భూముల్లో ఉందని ఆ శాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. ఈ మార్గంలో కామకూరు నుంచి వెంకటగిరికి చేరుకోవాలంటే 15 కి.మీ. దూరమే. కానీ సరైన దారి లేకపోవడంతో ప్రస్తుతం హస్తకావేరి మార్గంలో 26 కి.మీ చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

చిలమనూరు-కామకూరుకు జిల్లా అధికారుల ఆదేశాలతో 5.7 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. జార్లపాడు, కరిమెనగుంట, మల్లెమాల, కోనంగుంట, సీసీ కండ్రిగ తదితర గ్రామాలకూ అటవీ అడ్డంకులు తొలగించాల్సి ఉంది.
– లక్ష్మీనారాయణ, పీఆర్ డీఈ, వెంకటగిరి

సమస్య ఎక్కడెక్కడంటే...

● కోటంబేడు నుంచి మల్లెమాలకు 1.8 కి.మీ. దూరం నిడివి. వెంకటగిరి-నాయుడుపేట రహదారి నుంచి కోనంగుంటకు 700 మీటర్ల దూరమే. పిగిలాం-జార్లపాడుకు 2 కి.మీ. దూరం మట్టి రోడ్డే ఉంది.

● మేలంగారు-చక్రాచార్యులవారి కండ్రిగ-కైకావారి కండ్రిగకు అటవీ అడ్డంకులే. కైకావారి కండ్రిగకు మట్టి రోడ్డు లేకపోగా ఎటు వెళ్లాలన్నా మామిడి కాలువను దాటి నడవాలి.

● డక్కిలి మండలం వీవీపేట సముద్రానికి మధ్యలో రెండు కి.మీ. దూరం అటవీ సమస్యతో తారు రోడ్డు మోక్షం దక్కలేదు. పాతనాలపాడు-బ్రాహ్మణపల్లికి వెళ్లే మధ్యలోని కాలనీకూ ఇదే సమస్య. డి.వడ్డిపల్లి నుంచి వెంబులూరును కలిపే మార్గంలోనూ కిలోమీటరు దూరం అటవీ కారణంగా తారు రోడ్డు వేయలేదు.



ఎస్పీ కార్యాలయం వద్ద బాధితుడు, సీపీఎం నాయకులు

పోలీసులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: వెంకటగిరి జాతరలో దళిత యువకుడు చెంచుకుమార్‌ని కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు గోపి, రవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతరి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బాధితుడితో కలిసి అదనపు ఎస్పీ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోకపోతే ఈ నెల 28వ తేదీ వెంకటగిరి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ● వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని ఆర్పీడీ చట్టం 2016 కమిటీ సభ్యులు కొణతం చంద్రశేఖర్, ఏపీ నిరుద్యోగ వికలాంగుల ఐకాస నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు.

పెళ్లకూరు ఏఈ మహేష్ బదిలీ

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరు జల వనరుల శాఖ ఏఈ మహేష్‌ను నెల్లూరుకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో స్వర్ణముఖి బ్యారేజీ ఏఈ సుబ్బారావుని నియమించారు.

బాధ్యతల స్వీకరణ

కోట, న్యూస్‌టుడే: కోట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా అరవింద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిట్టమూరులో పని చేస్తూ బదిలీపై వచ్చారు. కోటలో పని చేసిన హేమంత్‌కుమార్ బదిలీపై వెళ్లారు. చిట్టమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మహేష్ నియమితులయ్యారు.

● కోట వెలుగు ఏపీఎంగా అనీలకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కావలిలో పని చేస్తూ బదిలీపై వచ్చారు. కోటలో పని చేసిన రత్నయ్య చిల్లకూరుకు వెళ్లారు.

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం మండలం వెలుగు ఏపీఎంగా మునిరాజ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా పెళ్లకూరు నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఏపీఎం ఓజిలికి బదిలీ అయ్యారు.

స్వర్ణాంధ్ర విజన్ 2047- గ్రామసభలు

కోట, న్యూస్‌టుడే: మండలంలోని 21 పంచాయతీల్లో శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్-2047 గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. కొక్కుపాడులో సర్పంచి ఇందిరమ్మ, ఎంపీటీసీ హిమబిందు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. కాలువలు, ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఉత్తమ నెల్లూరులో జరిగిన సభలో చెరువులో మట్టి తవ్వేస్తున్నారని గ్రామస్థులు ఇరిగేషన్ ఏఈ మునిరత్నంకు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ● **పెళ్లకూరు:** వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని సర్పంచి దేవారెడ్డి నాగేంద్రరెడ్డి కోరారు. బంగారంపేటలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన పలు సూచనలు చేశారు. కార్యదర్శి రమాప్రభ తదితరులు పాల్గొన్నారు. ● **ఓజిలి:** మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలతో పాటు, 2047 విజన్ డాక్యుమెంటరీ రూపకల్పనకు 13 పంచాయతీల్లో మండల పరిషత్ అధికారులు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఇందుకు సంబధించిన వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఉపాధి కల్పన, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలు అభిప్రాయాలు సేకరించారు. ● **తడ:** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కాదలూరులో శుక్రవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమంలో ఆమె పాల్గొని పండ్లు, పూలు అందజేశారు. ● **బాలాయపల్లి:** 23 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో వినీల్‌కుమార్ తెలిపారు. ● **సూళ్లూరుపేట:** కేసీఎన్‌గుంట పంచాయతీలో సర్పంచి దేవసేన అధ్యక్షతన శుక్రవారం స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు రమ్య, కార్యదర్శి సుధీర్ పాల్గొన్నారు.

తవ్వకాలపై కలెక్టర్ ఆగ్రహం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలు, రవాణాపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆయన సంబంధిత ఆర్డీవో ఆర్.చంద్రముని నుంచి ఆరా తీసినట్లు సమాచారం. సూళ్లూరుపేట డివిజన్‌లో మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలపై 'ఈనాడు'లో వరుస కథనాలు వచ్చాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా సూళ్లూరుపేట డివిజన్‌లోనే అక్రమ తవ్వకాలు ఎందుకు జరుగుతున్నాయని కలెక్టర్ ప్రశ్నించినట్లు తెలిసింది. డివిజన్‌లో అక్రమ తవ్వకాలపై ఆర్డీవో చర్యలు తీసుకుంటున్నా.. సూళ్లూరుపేట నియోజకవర్గంలో మాత్రం అధికార పార్టీ నేతలు దందా కొనసాగిస్తూ వచ్చారు. మాఫియాను పలుమార్లు ఆర్డీవో అడ్డుకున్నప్పటికీ ఆయనపై అధికారపార్టీ నేతలు తీవ్ర ఒత్తిడి తీసుకొస్తూ వచ్చారు. దాంతో ఆయన కాస్త తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మట్టి మాఫియా దందాలు ఎక్కువ కావడంతో పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన ఆర్డీవోను ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో డివిజన్‌లో ఎక్కడా కూడా మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలు జరగకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దీనిపై కలుగజేసుకున్న అన్ని మండలాల తహసీల్దార్లకు మెమోలు జారీ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా బేగం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమాజంలో ఆడ బిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు యువత ముందుండాలని, తమని తాము రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానాబేగం తెలిపారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతురావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేలంలో రూ.2,75,300 ఆదాయం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

కోట, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో భవాని ఆధ్వర్యంలో అద్దె భవనాలు లీజుకు, ఇతర పాత పరికరాలకు వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.2,75,300లు రాబడి వచ్చిందని డీఎల్‌పీవో వెంకటరమణ చెప్పారు. కోట పంచాయతీ పరిధిలోని 9 అద్దె భవనాలకు వేలం నిర్వహించగా మూడు భవనాలకు మాత్రమే పాటలు జరిగాయి. మిగతా 6 భవనాలకు ఎవరూ రాలేదు. కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణమ్మ, ఎంపీటీసీ షంషుద్దీన్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ కిరణ్‌కుమార్, ఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.



స్తంభించిన ట్రాఫిక్

వెంకటగిరి, న్యూస్‌టుడే: పోలేరమ్మ జాతర సందర్భంగా కైవల్యనది సమీపంలో రంగులురాట్నాలు ఏర్పాటు చేశారు. వంతెనకు ఇరువైపులా దుకాణాల ఏర్పాటుతో ఈ మార్గంలో వాహన రాకపోకలు స్తంభించాయి. రాజావీధి మార్గంలో కూడా రోడ్డుపైనే దుకాణాలు ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దక్షిణ వీధిలోని పోలేరమ్మకు సంబంధించిన స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే చెప్పినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

అంధకారంలో 50 ఇళ్లు



మండలంలోని వెంకటరెడ్డిపాలెంలో నాలుగు రోజులుగా 50 ఇళ్లు విద్యుత్తు శాఖ నిర్లక్ష్యానికి అంధకారంలో ఉన్నాయి. విద్యుత్తు సరఫరా ఇచ్చే సింగిల్ ఫేస్ నియంత్రిక నాలుగు రోజుల కిందట కాలిపోయింది. ఈ విషయాన్ని గ్రామంలోని జేఎల్ఎంకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. చివరకు విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మరో నియంత్రిక ఇచ్చినా అది కూడా పెట్టిన వెంటనే కాలిపోయిందని పేర్కొన్నారు. చేసేది లేక శుక్రవారం రాత్రి కూడా అంధకారంలో ఉన్నామని 50 ఇళ్ల వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వాకాడు డిస్కం ఏఈ విజయలక్ష్మిని వివరణ కోరగా కొత్త నియంత్రిక ఏర్పాటు చేస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, వాకాడు



సేవలు ప్రారంభిస్తున్న వైద్యాధికారి హరిత, సర్పంచి సుబ్రహ్మణ్యం

పింక్ బస్సు సద్వినియోగం చేసుకోండి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్ట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పింక్ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి హరిత సూచించారు. 40 ఏళ్లు నిండిన మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, పొగాకు ఉత్పత్తులను వినియోగించే పురుషుల్లో నోటి క్యాన్సర్లను గుర్తించేందుకు స్క్రీనింగు పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు షబ్బీర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దాత గౌరీశంకర్‌ని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

బాగుపడిన బడి

పెళ్లకూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం చదును చేయడానికి రూ.1.10లక్షల సాయం అందజేసిన దాత గౌరీశంకర్‌ని ప్రధానోపాధ్యాయుడు మునిశేఖర్ సన్మానించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మునికృష్ణయ్య, సురేంద్రబాబు, చెంగయ్య పాల్గొన్నారు.

పశు వైద్యం.. అందని దైన్యం

శిథిలావస్థలో వైద్యశాలలు ● అవస్థల్లో సిబ్బంది, పాడి రైతులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఏళ్ల నాటి పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మూగజీవులే కదా.. అవేం అడుగుతాయిలే అనుకున్నారో ఏమో అధికారులు సైతం నిర్లక్ష్యం వహించడంతో తగినట్లుగా చికిత్స అందడం లేదు. వైకాపా పాలనలో పశు వైద్యశాలలను పట్టించుకున్న పాపానే పోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. పశు వైద్యశాలల తీరు మాత్రం మారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బిక్కుబిక్కుమంటూ సిబ్బంది శిథిల భవనాల్లో విధులు నిర్వహిస్తూ కాలం వెల్లదీస్తున్నారు.



చెన్నూరులో శిథిలావస్థలో పశు వైద్యశాల



గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాలలో పెచ్చులూడిన శస్త్రచికిత్స గది

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే...

గూడూరు డివిజన్ పరిధిలో గూడూరు, వాకాడు, కోట, వెంకటగిరి పరిధిలో ప్రాంతీయ పశు వైద్య కేంద్రాలున్నాయి. 4 ప్రాంతీయ వైద్యశాల పరిధిలో 8 మండలాలు గూడూరు, చిల్లకూరు, వాకాడు, కోట, చిట్టమూరు, బాలాయపల్లి, వెంకటగిరి, డక్కిలిలో సుమారు 30కి పైగా పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటిలో 15 పైగా శిథిలావస్థకు చేరుకోగా, మరి కొన్ని పెచ్చులూడి పడుతున్నాయి.

■ గూడూరు మండలంలోని గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాలతోపాటు, చెన్నూరు, తిప్పవరపాడు.. డక్కిలిలోని పశువైద్యశాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

■ కోట మండలం కోట, విద్యానగర్, కొక్కుపాడు, కొత్తపాలెం, చిల్లకూరు మండలంలో ముత్యాలపాడు, ఓడూరు, పారిచెర్లపాడు, వాకాడు మండలంలో మొలగనూరు, బాలాయపల్లి మండలంలో నిండిగల్లు, నిండలి తదితర గ్రామాల్లో పశు వైద్యశాల భవనాలు పూర్తి అధ్వానంగా ఉన్నాయి.

ప్రతిపాదనలు పంపాం

పశు వైద్యశాలలు శిథిలావస్థలో ఉన్న విషయం వాస్తవమే. నూతన భవనాల నిర్మాణాలకి ప్రతిపాదనలు పంపాం. గతంలో శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరైతే భవన నిర్మాణాలు చేపడుతాం.
– రవికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, తిరుపతి

పోటెత్తిన భక్తజనం



పోలేరమ్మ అలయం వద్ద భక్తులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: వెంకటగిరి పోలేరమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గురువారం రాత్రి జాతర ముగిసిన తరువాత ఇతర ప్రాంతాలకు నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. అలయం వద్ద పొలిటెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ శీతల యంత్రంను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. వేలాది మంది భక్తుల రాకతో సందడి నెలకొంది.

హుండీ ఆదాయం..: జాతర 7 రోజులకు సంబంధించి హుండీ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. ఈవో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన ఆలయం హుండీ ద్వారా రూ. 20,08,028 లక్షలు, బంగారు పాదాల హుండీ ద్వారా 2,43,947, బంగారు 7.200 గ్రాములు, వెండి 98.500 గ్రాములు వచ్చిందన్నారు. బంగారు పాదాలకు భక్తులు 12.563 గ్రాములు ఇతర దేశాల కరెన్సీ అందించారన్నారు. రూ. 300 టిక్కెట్లు ద్వారా 5424 మంది, రూ. 100 టిక్కెట్లు ద్వారా 10,474 మంది భక్తులు పోలేరమ్మను దర్శించుకున్నారు. టిక్కెట్లు ద్వారా రూ. 26,74,600 ఆదాయం వచ్చిందని చెప్పారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దారు గీతావాణి

నాయుడుపేట: స్వర్ణముఖి తీరంలో నది పోరంబోకు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట తహసీల్దారు గీతావాణి హెచ్చరించారు. కుచివాడ సమీపంలో సర్వే నంబరు 140లో ఉన్న నదీ పోరంబోకు భూములను శుక్రవారం పరిశీలించారు. ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆస్తి వివాదంలో దాడి

తడ: పెరియవట్టు గ్రామానికి చెందిన సయ్యద్ ఇబ్రహీం కాలేషాను చెన్నైకు చెందిన సయ్యద్ ఇబ్రహీం అతని వర్గానికి చెందిన వ్యక్తులు ఆస్తి విషయమై దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండప్ప నాయుడు తెలిపారు.

మాచవరం భూముల్లో తవ్వకాలు

ఓజిలి, న్యూస్‌టుడే: మాచవరంలో మేత పోరంబోకు ప్రభుత్వ భూముల్లో గత రెండు రోజులుగా అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ ప్రాంతంలో పది ఎకరాలకు గనులశాఖ గ్రావెల్ తవ్వకాలకు లీజుకు కేటాయించింది. ఇది కాకుండా ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో రాత్రి సమయంలో అనధికారికంగా తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారులు స్పందించి తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం స్వయంసహాయ సంఘాలకు రుణాలు అందిస్తోందని మెప్మా సీఎంఎం కవిత తెలిపారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మహిళలు తయారు చేసే ఉత్పత్తులను మెప్మా బజారులో శుక్రవారం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రికి శవపేటిక వితరణ

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో ఫ్రీజర్ల కొరత తగ్గించే విధంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సొంత నిధులతో శీతల శవపేటికను అందజేయడం సంతోషమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలకు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తండ్రి పెంచలయ్య జ్ఞాపకార్థం శీతల శవపేటికను శుక్రవారం అందజేశారు.

అక్రమ కట్టడం ఆపాలని డిమాండ్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కొండాగుంట ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొందరు అక్రమ కట్టాడాలను కట్టుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 236లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై కొండాగుంట వీఆర్‌వో రాధాకృష్ణని వివరణ కోరగా అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థికసాయం

చిల్లకూరు: వల్లిపేడుకు చెందిన డేగ రామయ్య(32) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఇచ్చిన రూ.12 వేలు ఆర్థికసాయాన్ని స్థానిక తెదేపా నేతలు నందకుమార్, రత్నయ్య, శంకరయ్య, నాగరాజు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

పరిసరాల శుభ్రతపై ప్రజలు సహకరించాలి

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలను అధికారులు నిర్వహించారు. జువ్వినట్టు గ్రామంలో జరిగిన సభలో ఎంపీడీవో మనోహర్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

ప్రమాద ఘటనపై కేసు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: వెంగమాంబాపురం దగ్గర గురువారం కారు రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేశారు. వెంకటగిరి వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలను ఢీకొంది. ద్విచక్రవాహనదారుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బాలకృష్ణ తెలిపారు.

ఫిర్యాదు.. నాయుడుపేట పట్టణం: కాపులూరుకు చెందిన అప్పొడి వెంకటసుబ్బమ్మపై శ్రీనివాసులు, వరలక్ష్మి, లక్ష్మీప్రసన్న దాడి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైకాపా నేతలకు తాఖీదులు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పోలీస్ యాక్టు అమల్లో భాగంగా వైకాపా నేతలకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చారు. జగన్ పర్యటనకు వెళ్లడానికి సిద్ధపడ్డ వారికి తాఖీదులిచ్చి అదుపులోకి తీసుకున్నారు. వైకాపా రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధురెడ్డికి, అదే విధంగా మండలంలోని పలువురు నేతలకు నోటీసులిచ్చారు.